సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని పేర్కొన్నారు. 8లో▸



వ్యతిరేక విధానాలపై పోరు

కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ సూచించారు. 8లో▸



రేషన్ బియ్యం పక్కదారి

ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

పోరాటాల ఘనత సీపీఐదే

పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కమ్యూనిస్టు పార్టీ చరిత్ర గురించి నాయకులు, కార్యకర్తలు ప్రజలందరికీ వివరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. పార్టీ ఏర్పడి వంద వసంతాలు అవుతున్న సందర్భంగా చేవెళ్ల, ఎల్బీనగర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందని అన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తెచ్చి ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేసిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీ వందేళ్ల ఉత్సవం సందర్భంగా చేవెళ్ల, ఎల్బీనగర్‌లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లా, మండల కేంద్రాల్లో సభలు, సమావేశాలు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా సమితి సభ్యుడు చందుయాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

షాబాద్: సీపీఐ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, మండల కార్యదర్శి నక్కలి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

శంకర్‌పల్లి: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025–2026 సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 6వ తేదీ నుంచి http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 28 దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. ఆరో తరగతిలో నేరుగా ప్రవేశాలు ఉంటా యని, 7నుంచి 10వ తరగతుల్లో ఖాళీల భర్తీ ఉంటుందన్నారు. ప్రవేశాల కోసం ఓసీలకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 13న రాత పరీక్ష ఉంటుందని, ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే 'పట్నం'



షాబాద్: మండల కేంద్రంలోని పహిల్వాన్ షావలి దర్గాను ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. దర్గా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మతీన్, ఆయూబ్‌ఖాన్, ఆరీఫ్, మజీద్, ఇమ్రాన్, మునీర్, బాబషీర్, తౌసిఫ్ తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

కుల్కచర్ల: బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముజాహిద్‌పూర్ కాంగ్రెస్ నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లిన వారు చౌదర్‌గూడెం మండలం పెద్ద ఎల్కిచర్ల నుంచి మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ వరకు బీటీ రోడ్డు లేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు లేని గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ చౌదర్‌గూడెం మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వికారాబాద్ డీసీసీ కార్యదర్శి దేశ్‌ముఖ్ చంద్రభూపాల్, సీనియర్ నాయకులు శివకుమార్, రాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చేదును పంచుతున్న తీపి

ఆందోళన కలిగిస్తున్న మధుమేహం

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- జిల్లాలో 13,75,409 మందికి పరీక్షలు
- 47,592 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తింపు
- మారిన జీవనశైలే కారణం అంటున్న వైద్య నిపుణులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మధుమేహం చాపకింద నీరులా విస్తరిస్తోంది.. జిల్లాలో రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వారసత్వంగా కొంత మంది, జీవనశైలి మార్పుతో మరికొంత మంది ఈ వ్యాధి బారినపడుతున్నారు. సాధారణంగా 60 ఏళ్ల పైబడిన వారిలో వెలుగు చూసే వ్యాధి ప్రస్తుతం పాతికేళ్లలోపు వారిలోనే వెలుగు చూస్తోంది. నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) ఇటీవల విడుదల చేసిన డేటాను పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతోంది. నిద్రలేమి, పని ఒత్తిడికి తోడు ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ పెరిగిపోవడం.. శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడం.. పీకల దాక మద్యం తాగడం.. అర్ధరాత్రి పొద్దుపోయిన తర్వాత బిర్యానీలు ఆరగించడం వంటి అంశాలే ప్రధాన కారణమని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవనశైలిని మార్చుకోక పోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఏడాదిలో జిల్లాలో ఇలా..

వైద్య పరీక్షలు చేయించుకున్నవారు	13,75,409
రెండోసారి వైద్య పరీక్షలు చేయించుకున్నవారు	1,64,239
హైపర్ టెన్షన్ నిర్ధారణ అయిన వారు	95,239
వ్యాధి కంట్రోల్‌లో ఉన్నవారు	57,484
మధుమేహం ఉన్నట్లు తేలిన బాధితులు	47,592
వ్యాధి కంట్రోల్‌లో ఉన్నవారు	25,052

ఇతర అవయవాలపై ప్రభావం

నవంబర్ 30 నాటికి ఎన్‌సీడీ పోర్టల్ డేటా ప్రకారం జిల్లాలో 13,75,409 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా, వీరిలో 95,239 మంది అధికరక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. మరో 47,592 మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రధానంగా టైప్–2 మధుమేహ రోగుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బాధితుల్లో క్లోమగ్రంథి తగినంత ఇన్సూలిన్ ఉత్పత్తి చేయదు. కొన్నిసార్లు ఇన్సూలిన్ ఉత్పత్తి అయినా దానిని రక్తంలోకి తీసుకెళ్లేందుకు నాళాలు సక్రమంగా పనిచేయవు. తద్వారా రక్తంలో గ్లూకోజు హెచ్చుతగ్గుల సమస్య ఉత్పన్నమవుతుంది. పరోక్షంగా గుండె, కిడ్నీ, కాలేయం, కంటిచూపు పనితీరుపై ప్రభావం చూపుతుంది.

ఇదీ లెక్క

- పుట్టుకతోనే శరీరానికి ఇన్సూలిన్ తయారు చేసుకునే శక్తి ఉండక పోతే టైప్–1 మధుమేహంగా పిలుస్తారు. జన్యుపరమైన కారణాలతో ఇది వస్తుంది. వీరికి ఇన్సూలిన్ ఇస్తూ ఉండాలి.
- టైప్–2 మాత్రం మనం చేజేతులా కొని తెచ్చుకున్నదే. ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారుతోంది. తాజా అధ్యయనాల ప్రకారం కీటోజనిక్ ఆహారంతో నియంత్రణలో పెట్టుకోవచ్చని తేలింది.
- టైప్ –2 ఎక్కువ శాతం ఊబకాయంతో వస్తుంది. అతి మూత్రం, అతి ఆకలి, అతి దాహంతో పాటు ఆహారం చక్కగానే తీసుకుంటున్నా బరువు తగ్గడం, నీరసం, నిస్సత్తువ, అలసట వంటి లక్షణాలుంటే అనుమానించాల్సిందే.
- పరగడుపున రక్తంలో గ్లూకోజు 125 మి.గ్రా/డీఎల్.. భోజనం చేశాక 200 మి.గ్రా/డీఎల్ కంటే ఎక్కువ ఉంటే మధుమేహం వచ్చినట్లే. ఈ స్థాయిలో పరగడుపున 100.. తర్వాత 140–200 మధ్యలో ఉన్నా సరే ముందస్తు (ప్రీడయాబెటీస్) ఉన్నట్లే.
- ఇప్పటికే వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే అధిక రక్తపోటు 130/80 దాటకుండా చూసుకోవాలి. ఎల్‌డీఎల్ 70ఎంజీ/డీఎల్‌కు దగ్గరగా ఉండాలి. హెచ్‌డీఎల్ 39ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉండాలి. ట్రిగ్లిజరైడ్ల స్థాయిలు దాదాపు 150 ఎంజీ/డీఎల్‌కు దగ్గరగా ఉండాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

రూ.5 వేల కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



వెంకటస్వామి వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఉత్తమ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గత టీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థను గాలికి వదిలేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రూ.5 వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి 10వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు వెంకటస్వామి విగ్రహానికి స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటివ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తామన్నారు. జాతీయ రాజకీయాల్లో 'కాకా' కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తన చివరి శ్వాస వరకు పేద ప్రజల కోసమే 'కాకా' పని చేశారని కొనియాడారు. 80 వేల మంది పేదలకు నీడ కల్పించిన మహోన్నత వ్యక్తి అన్నారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును తమ కళాశాలలో ప్రవేశపెడుతున్నట్లు అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వినోద్ కుమార్, ఎంపీ వంశీకృష్ణ, కరస్పాండెంట్ సరోజా వివేక్, వెంకటస్వామి కుమార్తెలు వీణ, విజ్జీ, మాజీ మంత్రి డాక్టర్ శంకర్‌రావు, డైరెక్టర్లు డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన

ధ్యానం.. సంబరం

రెండో రోజుకు చేరిన మహాయాగం

- హాజరైన సినీ స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు





మాట్లాడుతున్న స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్

కడ్తాల్: సాధనతో సాధించలేనిదంటూ ఏదీ లేదని ధ్యానగురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం ఆదివారానికి రెండో రోజుకు చేరుకుంది. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్ కింగి ఆధ్వర్యంలో ప్రాతఃకాల సంగీత ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులను ఉద్దేశించి పరిణిత పత్రి మాట్లాడారు. నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని, దానికి సాధనే మార్గమన్నారు. ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగా లని ఆకాంక్షించారు. ధ్యానాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పుతూ పత్రీజీ సంకల్పాన్ని నెరవేర్చాలని కోరారు. ప్రపంచాన్ని ధ్యానమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సినీ స్టంట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా దాని లోని సూక్ష్మాన్ని గ్రహించి సత్యం తెలుసుకోవా లని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని, ఆత్మ జ్ఞానం తెలుసుకున్న వారే ధ్యానులన్నారు. అనంతరం సుభాష్‌పత్రీజీ, స్వర్ణమాల పత్రీజీల వీడియో సందేశం ధ్యానులకు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశం వినిపించారు. ఆదివారం కావడంతో వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పత్రీజీ మార్గంలో నడవాలి

ఏ జీవినీ చంపి తినే హక్కు ఎవరికీ లేదని బీఏపీఎస్ స్వామి నారాయణ్ అక్షర్‌ధామ్ మందిర్ పూజ్య జ్ఞాన వత్సల్ స్వామీజీ అన్నారు. ఆదివారం మహేశ్వర మహాపిరమిడ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి మాట్లాడారు. ధ్యాన గురువు పత్రీజీ చూపిన ధ్యాన మార్గంలో నడవాలని సూచించారు. పిరమిడ్ మాస్టర్లను కలవడం చాలా సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఇంతటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్న పిరమిడ్ నిర్వాహకులను అభినందించారు.



పుస్తకం పిలిచింది!

- బుక్‌ఫెయిర్‌కు సందర్శకుల తాకిడి
- సెలవు రోజు కావడంతో పెరిగిన రద్దీ
- విద్యార్థులు, యువత రాకతో కిటకిట



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. సెలవురోజు కావడంతో పుస్తక ప్రియులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. యువత, విద్యార్థులు, పిల్లలతో స్టాళ్లు కిటకిటలాడాయి. ముఖ్యంగా చిన్నారులు తమకిష్టమైన ఆంగ్ల కథలు, క్లాసిక్స్ పుస్తకాలను విరివిగా కొనుగోలు చేశారు. ఒకవైపు పుస్తక ఆవిష్కరణలు, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక సమీక్షలు, అమ్మకాలతో సందడి నెలకొంది. పుస్తక ప్రదర్శన కేవలం పుస్తకాల అమ్మకాలకు మాత్రమే పరిమితం కాకుండా రచయితలను, పాఠకులను ఒకచోట చేర్చే వేదికగా మారింది. ప్రదర్శన ప్రారంభమై నాలుగు రోజులైంది. రెండు రోజులుగా పుస్తక ప్రియుల నుంచి అనూహ్యమైన స్పందన కనిపిస్తోందని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కొత్త సంవత్సరం పుస్తక పఠనంతో ప్రారంభం కావాలనే ఆకాంక్షతో ఎక్కువ మంది తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా వయోధికులే ఎక్కువగా పుస్తకాల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగి ఉంటారనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ యువత పెద్ద సంఖ్యలో కనిపించడం విశేషం.

రాజ్యాంగం 5 రకాలుగా..

భూమిపుత్ర, బహుజన పుస్తక ప్రచురణ సంస్థలకు చెందిన 203, 204 స్టాళ్లలో భారత రాజ్యాంగం గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. బాబాసాహెచ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పిల్లలకు, పెద్దలు నచ్చేవిధంగా 5 రకాలుగా ముద్రించి ప్రదర్శనలో ఉంచారు.

నేడు పుస్తక నడక..

పుస్తక పఠనంపై ప్రజల్లో ఆసక్తిని, అభిరుచిని, అవగాహనను పెంపొందించే లక్ష్యంతో సోమవారం పుస్తక నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ నిర్వాహకులు తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు జరగనున్న ప్రదర్శనలో పాఠకులు, రచయితలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు.

సేవలకు ఆటంకం

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన బాట
- సమస్యలు పరిష్కరించేదాకా విరమించేది లేదని స్పష్టీకరణ
- మండల వనరుల కేంద్రాల్లో సమ్మె ప్రభావం
- విద్యాశాఖలో ఆన్‌లైన్ సేవలు బంద్
- ఆగిపోయిన మధ్యాహ్న భోజన బిల్లులు
- కేజీబీవీ, భవిత కేంద్రాల్లో తప్పని తిప్పలు



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. వారి డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె చేస్తున్నారు. రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో చేపట్టిన ఆందోళన రోజురోజుకూ ఉధృతమవుతోంది. ఇందులో భాగంగా రోజుకోరకంగా నిరసన తెలుపుతున్నారు. జిల్లాలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 15 రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నారు. వీరికి రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు మద్దతు పలుకుతున్నారు.

సమ్మెతో సకలం బంద్

జిల్లాలోని 27 మండలాల్లో 1,100 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో 739 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీఓలు, సిస్టమ్ అనాలసిస్టులు, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్లు, డీఏల్ఎంటీ, మెసెంజర్లు ఉండగా, మండల స్థాయిలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, మెసెంజర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, పాఠశాల స్థాయిలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంట్స్, క్రాఫ్ట్, కంప్యూటర్, వంట మనుషులు, వాచ్‌మన్‌లు, స్వీపర్లు పని చేస్తున్నారు. సమ్మెతో పీఎం పోషణ్, ట్రెజరీకి సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు నిలిచిపోయాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే వంట కార్మికుల బిల్లులను ప్రతీ నెల బ్యాంకులకు పంపించాలి. ఈ బిల్లులను మండల విద్యాధికారి కార్యాలయాల్లో పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేసి ట్రెజరీకి పంపిస్తారు. ప్రతి మండలంలో దాదాపు 50 నుంచి 150 మంది వరకు వంట కార్మికులు ఉంటారు. వీరి అకౌంట్లో బిల్లులు జమ చేయాల్సి ఉంటుంది. సమ్మెతో ఈ పనులు నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజన ఇండెంట్ ఆన్‌లైన్ చేసే వారు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజు నిర్వహించే ఆన్‌లైన్ సేవలన్నీ నిలిచిపోయాయి. మరోవైపు కేజీబీవీలు, భవిత కేంద్రాలు, పాఠశాలల్లో బోధన లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

డిమాండ్లు ఇవే..

- సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) అవకాశం కల్పించాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్యబీమా రూ.10 లక్షలు సౌకర్యం కల్పించాలి.
- పదవీ విరమణ చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియమకాల్లో వెయిటేజీ కల్పించాలి.
- పీటీఐలకు నెలకు రూ.12 వేల వేతనం ఇవ్వాలి.

రెగ్యులర్ చేయాలి



ఇబ్రహీంపట్నం మండల మానవ వనరుల కార్యాలయంలో 18 సంవత్సరాలుగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. ఇప్పటి వరకు పనికి తగిన వేతనం లేదు. విద్యాశాఖలో ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నాం. పని బారెడు జీతం మూరెడు అన్నట్లుగా ఉంది. జిల్లాలో పని చేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలి. అప్పటి వరకు ఉద్యమాన్ని ఆపేది లేదు.

– జె.సంపత్, సమగ్ర శిక్ష జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం గుర్తించాలి



సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించాలి. అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలి. కుటుంబాలను విడిచిపెట్టి పని చేసే ప్రదేశాలను వదిలి 15 రోజులుగా ఆందోళన బాట పట్టాం. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల గురించి చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

– స్వప్న, జిల్లా నాయకురాలు

రేషన్ బియ్యం పక్కదారి

కేసులు నమోదైనా మారని దళారుల తీరు



పోలీసులు సీజ్ చేసిన వాహనం (ఫైల్)

కొందుర్గు: ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేసిన మరుసటి రోజే వాటిని కొనడానికి దళారుల వాహనాలు గ్రామాలకు చేరుకుంటాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పలుమార్లు పోలీసులు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది నవంబర్ 5న రేషన్ తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని సీజ్ చేశారు. 100 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి దళారులు లాభార్జనకు పాల్పడుతున్నారు. అక్రమంగా కొనుగోలు చేసిన బియ్యం మండలంలోని చిన్నఎల్కిచర్ల, పుల్లప్పగూడ గ్రామాల్లో నిల్వచేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామాల్లోనే పలుమార్లు బియ్యం పట్టుబడ్డాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



షాబాద్: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మహాత్మా జ్యోతిపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్–2024 కబడ్డీ పోటీల్లో మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి, పీడీ బాలయ్య, పీఈటీ రేణుక, మండల చైర్మన్, ఎంపీడీఓ, ఎంఈఓ, పీడీలకు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

సీఎం కప్ పోటీల్లో మెరిసిన యువకుడు



శంకర్‌పల్లి: ప్రశంసాపత్రం అందుకుంటున్న వరుణ్ గౌడ్

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్–2024 జిల్లా స్థాయి పోటీల్లో శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామానికి చెందిన వరుణ్ గౌడ్(16) సత్తా చాటాడు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షాట్‌పుట్, డిస్కత్రో విభాగాల్లో ప్రథమంగా నిలిచి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. కొండకల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్, కల్పన దంపతుల చిన్న కుమారుడు వరుణ్ గౌడ్. ఈ యువకుడు ప్రస్తుతం బాసరా ఐఐఐటీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పతకాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

సీబీఐటీకి 'ఎక్సలెన్స్' అవార్డు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) నుంచి ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల అంకితభావం, సమష్టి కృషికి ఈ అద్భుతమైన అవార్డు మొదటిసారి దక్కిందని ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణలు, పరిశోధనలలో రాణించాలనే అన్వేషణ ఈ విశిష్ట గౌరవాన్ని పొందటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ విద్యలో అగ్రభాగాన ఉన్న సీబీఐటీకి ఈ అవార్డు మరింత బలోపేతం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అంకితభావంతో పనిచేందుకు ఇది ఎంతో సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటేశ్ (ఫైల్)

మంచాల: అప్పు తీర్చుతానని చెప్పి ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తిప్పాయిగూడ గ్రామానికి చెందిన గొర్రెంకల వెంకటేశ్(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూతురు పెళ్లికి కొంత అప్పు చేయడంతో నగరంలో ఉన్న ప్లాటును అమ్మేస్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ క్రమంలో వెంకటేశ్ ఈ ఏడాది జూన్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికినా లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 77022 20964 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లిన వృద్ధుడు..



సదానందం (ఫైల్)

పహాడీషరీఫ్: మందుల కోసం ఆస్పత్రికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఆదిమూలం సదానందం(75) అనారోగ్యం కారణంగా ఈ నెల 19వ తేదీన ఉదయం ముందులు తెచ్చుకునేందుకని ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

తల్లి మందలించిందని బాలుడు..



చందు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి ఓ బాలుడు పారిపోయిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సోమయ్య కథనం ప్రకారం.. నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్ కాలనీకి చెందిన కొంగర చందు అనే బాలుడు బడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన బాలుడు ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 87125 78845కి తెలియజేయాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు



ఆమనగల్లు: జెండాను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు



మీర్‌పేట: జెండావిష్కరణలో సీపీఎం నేతలు

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమిలీ ఎన్నికల పేరుతో నియంత పాలనకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి ఏరియా సీపీఎం మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతరం ఉద్యమిస్తుందని చెప్పారు. కార్మిక, కర్షక, విద్యార్థి, ప్రజా ఉద్యమాలలో సీపీఎం ముందుండి పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, కర్షక చట్టలకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమాల ఫలితంగా కేంద్రం వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజలకు విద్య, వైద్యం సరిగా అందడం లేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజునాయక్, నాయకులు శివశంకర్, పెంటయ్య, కురుమయ్య, చెన్నయ్య, నర్సింహ, హంసమ్మ, రమేశ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

మీర్‌పేట: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేల్, డి.జగదీష్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ బాలాపూర్ మండల 2వ మహాసభను మీర్‌పేటలో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. మండలంలోని గొలుసు కట్టు చెరువులను కబ్జా నుంచి రక్షించడంతో పాటు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్లలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని, అదనంగా సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదగిరిచారి పాల్గొన్నారు. మండల కార్యదర్శిగా ఎం.యాదయ్య, సభ్యులుగా బి.ప్రకాశ్‌రెడ్డి, దాసరి బాబు, కె.శ్రీనివాస్, టి.ఎలీషా, శశిపాల్‌గౌడ్, శేఖర్ యాదవ్, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు.

ముగిసిన 'బ్రిగ్‌కాన్-2024' సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఐ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాసుటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియన్(ఏపీటీఐ) ఆధ్వర్యంలో బ్రిగ్‌కాన్–2024 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీటీఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వీరారెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఫార్మారంగంలోని పరిశోధనలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అకాడమిక్ డైరెక్టర్ రఘోత్తంరెడ్డి సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫార్మాసూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమోహన్ చిన్నాల, రఘునందన్, రమేష్, కళాశాల డైరెక్టర్స్ నరేంద్రకుమార్, పెన్లన్‌పాల్డాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ కంట్లమ్, ఏఓ రవీందర్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రంపల్లిలో స్పీకర్ ప్రత్యేక పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జాతర మహోత్సవంలో భాగంగా మల్లికార్జున స్వామిని ఆదివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో మందిరాలకు వెళ్లి పూజించాలని ఆయన కోరారు. జాతర మహోత్సవాలు చేయడంతో సోదరభావం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎయిర్‌పోర్టు పరిసరాల్లో వ్యక్తి మృతి

శంషాబాద్: మూడురోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి ఎయిర్‌పోర్టు పరిసరాల్లో మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన వెంకయటయ్య(55) మూడురోజుల కిందట అదృశ్యం అయ్యాడు. ఆదివారం ఉదయం ఎయిర్‌పోర్టు ప్రాంగణ గేటు సమీపంలో కుళ్లిపోయిన మృతదేహం కనిపించడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఆధారాలతో పాలమాకులకు చెందిన వెంకటయ్యగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్తాపూర్‌లో అగ్ని ప్రమాదం

అత్తాపూర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా డ్రైక్లీనింగ్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్ కాలనీలో ఎంఎం ఫ్యాబ్రిక్ పేరుతో డ్రై క్లీనింగ్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం షాపు నుంచి మంటలు రావడంతో స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు రూ. 3 లక్షల మేర నష్టం జరిగిందని భావిస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లి రాలేదని..

ఉరేసుకొని భర్త ఆత్మహత్య

తాండూరు రూరల్: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాక పోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని చెంగోల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సగాళ్ల రమేశ్(33) కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. ఆయనకు 12 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్‌కు చెందిన అనితతో వివాహమైంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో నాలుగేళ్ల నుంచి అనిత పుట్టింటిలో ఉంటుంది. దీంతో రమేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం చెంగోల్ గ్రామంలోని తన ఇంటిలో దులానికి చీరతో ఉరేసుకున్నాడు. తల్లి అనంతమ్మ చూసి స్థానికులకు చెప్పడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్టు

పంజగుట్ట: హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్‌కు చెందిన పున్నం లోకేష్ (21) బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అతను స్నేహితుడితో కలిసి బైక్‌పై కాలేజీకి వెళుతుండగా అమీర్‌పేట బిగ్‌బజార్ వద్ద వెనక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో లోకేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన బస్సును గుర్తించారు. గో టు ట్రావెల్స్‌కు చెందిన బస్సును ప్రమాద సమయంలో డ్రైవర్ ఓంప్రకాష్ నడుపుతున్నట్లు గుర్తించారు. శనివారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బస్సును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి..

జీడిమెట్ల: కోడిపందేల స్థావరంపై దాడి చేసిన జీడిమెట్ల పోలీసులు 11మందిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కోడిపందేలు ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,440 నగదు 9 సెల్‌ఫోన్‌లు, 16 కత్తులు, ఆరు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



ఆలేడ్ బండా రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో కలప డంపు

దుద్యాల్: అక్రమార్కులు కలపపై కన్నేసి విచ్చలవిడిగా చెట్లను నరుకుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మండల పరిధిలోని ఆలేడ్, హస్నాబాద్, గౌరారం, లగచర్ల గ్రామాల్లో ఆదివారం అక్రమార్కులు విచ్చలవిడిగా చెట్లను నరుకుతున్నారు. ఎక్కడిక్కడ ఇష్టానుసారంగా కలప డంపులు ఏర్పాటు చేస్తున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల అండదండలతో కలప వ్యాపారులు రెచ్చిపోతున్నారు. దుద్యాల్ మండలంలో నిత్యం కలపను తరలిస్తున్నారని ఆయా గ్రామాలకు చెంది పలువురు వాపోయారు. మండలంలో పెద్ద ఎత్తున చెట్లను నరుకుతూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పర్యవేక్షించాల్సినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

చెత్త నిర్మూలనకు సరికొత్త ప్రయోగం!

- వేయకుండా చూసేందుకు సిబ్బంది నియామకం
- ప్రజల్లో చైతన్యం కల్పించే దిశగా ఏర్పాట్లు
- అయినా వేస్తే జరిమానా తథ్యం
- సత్ఫలితాలిస్తున్న అధికారుల చర్యలు



బుద్వేల్ ఓపెన్ పాయింట్ వద్ద కాపలాగా ఉన్న కార్మికుడు

రాజేంద్రనగర్: ఓపెన్ పాయింట్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేయకుండా జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఓపెన్ పాయింట్ల వద్ద గతంలో శుభ్రపరిచి రంగు రంగుల ముగ్గులు వేసి చెత్త వేయవద్దంటూ ప్రచారం చేశారు. ఇది విజయవంతమైంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ చెత్త ఇతర వ్యర్థాలను వేస్తుండటంతో రేయింబవళ్లు కాపలాగా అక్కడే వాచ్‌మెన్ నియమించి చేసి చెత్త వేయకుండా అడ్డుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన ఓపెన్ పాయింట్ల వద్ద సిబ్బందిని నియమిస్తున్నారు. చెత్త వేసే వారిని సిబ్బంది అడ్డుకుంటున్నారు. వారి ఫొటోలను సైతం తమ సెల్‌ఫోన్లలో పంపిస్తుండటంతో ఓపెన్ పాయింట్ల వద్ద చెత్తను వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

– సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో దాదాపు 60 ఓపెన్ పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్ల వద్ద రోజే వాహనాలపై వెళ్లేవారు. స్థానికులు, దుకాణాల నిర్వాహకులు చెత్తను ఇష్టారాజ్యంగా వేసేస్తున్నారు. వీరికి ఒక్క పక్క కౌన్సిలింగ్ ఇస్తూనే ఆయా ప్రాంతాల్లో చెత్త వేయకుండా అడ్డుకునేందుకు వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఓపెన్ పాయింట్ల చెత్త వేయడం దాదాపు తగ్గిందని అధికారులు, సిబ్బంది వెల్లడిస్తున్నారు.

శుభ్రత పాటించండి...

బహిరంగ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయరాదని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. ఓపెన్ పాయింట్లలో ఇప్పటికే వాచ్‌మెన్‌లను నియమించాన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ వాచ్‌మెన్ ఏర్పాటు ద్వారా చెత్త డంపింగ్‌లను నిర్మూలించామన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో చెత్తను వేస్తున్నారని తెలిపా. వారిని గుర్తించి అపరాధ రుసుము విధిస్తామన్నారు. తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణదారులకు చెత్తను అందించాలని ఆయన కోరారు.

బండ్లగూడలో కదంతొక్కిన కార్మికులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి

బండ్లగూడ: మున్సిపల్ కార్మికులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం బండ్లగూడ జాగీర్ చౌరస్తాలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ చౌరస్తాలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రుద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సుమారు 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్ పే డైలీ వేజెస్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్నారు. సిబ్బందికి పర్మినెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి ప్రభుత్వ సంక్షేమాలు అమలు కావడం లేదన్నారు. పని చేస్తున్న సమయంలో మరణిస్తున్నారని వాపోయారు. రెండవ పీఆర్‌సీలో కనీస వేతం రూ. 26 వేల ప్రకారం చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులకు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులను కార్మికుల ఖాతాల్లో చేయడం లేదన్నారు. జమ చేయని మున్సిపల్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు సురేష్, జగన్, సుభాష్, రామాంజనేయులు, నవీన్, నరేందర్, రాము, లక్ష్మీనారాయణ, కార్మికులు భారతమ్మ, అంజమ్మ, పార్వతమ్మ, స్వరూప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.